"అదేమిటంటే- టివీలో మన కంపెనీ తరపున ఒక సీరియల్ ప్రదర్శించడం! ఆ సీరియల్లో కథ ఏమిటంటే- ఒక కంపెనీలో బంధువులందరికీ టెంపరరీ ఉద్యోగాలిచ్చేయటం, తరువాత సరదాగా నామమాత్రంగా ఒక ఇంటర్వ్యూ పెట్టటం, ఆ ఇంటర్వ్యూకి యిద్దరు గుంటనక్క ముఖాల వెధవలు రావడం, పాతవారినే సెలక్ట్ చేసుకుని, కొత్తవారిని చూసి నవ్వుకోవడం, మంచి ఎంటర్‌టయిన్‌మెంట్ ప్రోగ్రాం అవుతుంది"

వాళ్ల పిడికిళ్ళు బిగుసుకుంటున్నాయి. సురేష్ బయటికొచ్చేశాడు.

తిన్నగా లైబ్రరీ కెళ్ళాడు.

"హలో" అంది కళ్ళజోడు పిల్ల.

"హల్లో..."

"రెండ్రోజుల్నుంచీ రావటం లేదు?"

అతను ఆ అమ్మాయి వైపు రెప్పవాల్చకుండా చూశాడు.

"యూ ఆర్ వెరీ బ్యూటిఫుల్"

"నేనడిగిందదికాదు" నవ్వుతూ అంది.

"ఆదివారం మా గాళ్‌ఫ్రెండ్‌కి హాలిడే కదా.... అందుకని చాలా బిజీగా వుంటాం."

ఆమె సిగ్గుపడింది. "మీ కోసం కట్ చేసి వుంచానిది" ఓ పేపర్ కటింగ్ అతనికిస్తూ అందామె. సురేష్ తీసుకుని చదివాడు.

"నిరుద్యోగులకు అద్భుత అవకాశం ! నేడే మా బ్యాంక్ శాఖలను సంప్రదించండి."

"నేడే అన్నారు కదా! ఇవాళ చాన్స్ వుండదేమో......." నవ్వుతూ అన్నాడు.

"మీకు తప్పకుండా ఇస్తారని అన్పిస్తోంది నాకు."

"నాకివ్వరు"

"ఎందుకని?"

"నా జాతకంలో వుందలా" లోపలకు నడిచి పేపర్లన్నీ చూశాడు.

అన్నిట్లోనూ అవే ప్రకటనలు. జనరల్ మేనేజర్ కావలెను -5000 ప్లస్ పెర్క్స్. బంగళా, కారు, రెండు డిగ్రీలు , ఓ డిప్లొమా ఏడేళ్ళ ఎక్స్‌పీరియన్సూ.

డిప్యూటీ జనరల్ మేనేజర్! 3000 ప్లస్ పెర్క్స్, బంగళా, కారు డిటో!

వర్క్‌షాప్ మేనేజర్! ఇంతకు ముందు కూడా ఇలాంటి ఉద్యోగమే చేసి వుండాలి,

పర్సనల్ ఆఫీసర్!

డిటో...... రెండు గంటల తర్వాత తిరిగి బయటికొచ్చాడతను.

ఎండ మాడ్చేస్తోంది. బస్ స్టాప్‌లో ఓ అమ్మాయి అతనివంక చూసింది.

"హలో....బావున్నారా?" అడిగాడు సురేష్.

ఆమె అతనివైపు కోపంగా చూసింది.

"మనం అదివరకోసారి కలుసుకున్నాం. మర్చిపోయారా?"

"ఎప్పుడు?"

"ఇరవై ఏళ్ళ క్రితం"

ఆమె అనుమానంగా చూసింది.

"అప్పర్ కే.జి ఇద్దరం కలసి చదువుకున్నాం"

ఆమె నమ్మలేకపోతోంది.

"రోజూ మీకు చాక్‌లెట్స్ కొనిచ్చేవాడిని....."

బస్ వచ్చింది. ఆమె నెంబర్ కూడా చూడకుండా వెళ్ళి ఎక్కేసింది.

సురేష్ ఇంటికి చేరుకున్నాడు. వంటింట్లో తినడానికి ఏమీ కన్పించలేదు. మంచి నీళ్ళు తాగి పడుకున్నాడు. ఇంకా రెండు గంటల టైముంది తులసి రావడానికి.

ఇవాళ ప్రోగ్రాం వుంది. పిక్చర్, డిన్నర్. రాత్రికైనా కడుపునిండా తినేయాలి. నిద్ర పట్టేసిందతనికి. తులసి తన నుదుటి మీద ముద్దు పెట్టుకుంటూంటే తిరిగి మెలకువ వచ్చింది.

"హలో డియర్! ఎంతసేపయింది వచ్చి?"

"రెండు గంటలు"

సురేష్ అదిరిపడి లేచి కూర్చున్నాడు.

"మరి నన్ను లేపలేదేం"

"ఎందుకు లేపడం?"

"మనకి ప్రోగ్రాం వుందిగా యివాళ?"

తులసి అతని పక్కనే కూర్చుంది మోకాళ్ళమీద తల పెట్టుకుని.

"కాన్సిలయింది"

"ఎందుకని?"

"జీతంలో సగం అతను తీసేసుకున్నాడు"

"ఎవరు?"

"నీ పాత రూమ్ ఓనరే......"

"బాస్టర్డ్"

సురేష్ ఆమె పక్కకు తిరిగి, ఆమెను దగ్గరకు లాక్కుని ఆమె తలమీద ముద్దు పెట్టుకున్నాడు "సారీ డియర్"

"బెటర్‌లక్ నెక్ట్స్ టైమ్" నవ్వుతూ అంది.

గంగాభవాని లోపలకొచ్చేసరికి ఇద్దరూ కౌగిలి నుంచి విడివడ్డారు. గంగాభవాని సిగ్గుపడింది.

"మళ్ళీ వస్తాన్లెండి" అంది వెనక్కి తిరుగుతూ.

"మీరెప్పుడొచ్చినా ఇంతేలెండి" అన్నాడు సురేష్.

"మీతో మాట్లాడ్డానికే వచ్చాను."

"ఇప్పుడా! ఇప్పుడు తులసి వుందిగా?"

"ఉంటేనేం?"

"మూడో మనిషి ఎదురుగ్గా.......అఫ్‌కోర్స్....నాకేం అభ్యంతరం లేదు."

గంగాభవానికి కోపంగానూ వుంది, ఇంకా అతనితో మాట్లాడాలనీ వుంది.

"మీరు చెప్పేవన్నీ అబద్ధాలు కదూ?"

"ఏమిటి అబద్ధాలు ? రోడ్స్ అండ్ బిల్డింగ్స్ డిపార్ట్‌మెంట్ సంగతా? ఆ విషయం ఇంకా మర్చిపోలేదా మీరు? రేపు టాబ్‌లెట్ తెచ్చిస్తాను. మీరు వేసుకోండి".

"ఏ టాబ్‌లెట్?"

"అదే మనకు అవసరం లేని విషయాలు మర్చిపోయేందుకు టాబ్‌లెట్స్......."

"నేను చెప్పేది ఆ విషయం కాదు"

"మరి?"

"మీరు ఇంజనీరుగా ఇరాక్ వెళుతున్నానన్న విషయం........ఒక వారంలో వెళతానన్నారు యిందాక"

"కొద్ది సంవత్సరాలు అటూ ఇటూ వుంటుంది కదా......అయినా ఎవరు చెప్పారు అది అబద్ధమని?"

"తులసిగారు"

తులసి నవ్వేసింది.

"అయితే అది కూడా మర్చిపోండి! రెండింటికి టాబ్‌లెట్స్ తెచ్చిస్తాను"

గంగాభవాని వెళ్ళిపోయింది. సురేష్ బయటికొచ్చి వీధి చివర్లో వున్న గిఫ్టుషాప్‌లో కెళ్ళాడు.

"గుడ్ మాణింగ్ సర్! వెల్ కమ్........." అంది అందమయిన ఆంగ్లో ఇండియన్ అమ్మాయి.

"గుడ్‌మాణింగ్ 32-26-28........."

"నో ....యూ ఆర్ మిస్టేకెన్ 31-25-29"

సురేష్ కొంచెం ఖంగుతిన్నాడు.

"అయితే నేను ఇంకొంచెం ట్రైనింగ్ తీసుకోవాలనుకుంటాను"

"కాదు-టైలరింగ్......"

ఓహ్! తను వెళ్ళేదారి ఈ పిల్ల దగ్గర పని చేయదు. దెబ్బ కొట్టేస్తుంది.

"గిఫ్టుగా ఇవ్వదగ్గ వస్తువులేమున్నాయ్ మీ దగ్గర?"

"అన్నీ అవే"

"ఓర్నాయనో!" అనుకున్నాడు.

అల్మరాలో అందంగా పేర్చిన వస్తువులు చూడసాగాడు.

"ఈ అరలోని ఆర్టికల్స్ అన్నీ ఒకటే ధరా?"

"మీక్కనిపించే వాళ్ళ మెజర్ మెంట్స్ అన్నీ ఒక్కటిగా వున్నాయా?"

"కొంచెం మంచినీళ్ళిస్తారా?"

"ఏదయినా కొంటేనే. స్ట్రిక్ట్ ఆర్డర్స్ ఇచ్చారు మా బాస్. రియల్ కస్టమర్స్‌కే ఫెసిలిటీస్."

అందమైన ఇత్తడి శిల్పం తీశాడు సురేష్. బుద్ధుడి తల, ఎంతో అందమైన ఫినిషింగ్. తులసికి ఎంతో గౌతమిబుద్ధుడంటే.

"ఎంతిది?"

"నాలుగొందల అరవై"

"నేనడిగేది మీతో కలిపి కాదు"

ఆమె మాట్లాడలేక నవ్వేసింది " యూ ఆర్ ఫ్రాడ్"

అమ్మయ్య ఇప్పటికి కొట్టాడు దెబ్బ. మరోసారి ఫోజు కొట్టదిక.

"ఆల్‌రైట్! ఇన్‌స్టాల్‌మెంట్స్ పద్ధతిలో ఇస్తారా?"

"నో ప్లీజ్ ! కాష్ డౌన్."

"మెహిందీ బజార్ సిస్టం అన్నమాట మీది?"

"అంటే?"

"అదే కాష్ డౌన్ ఫస్ట్. పోనీ మా గర్ల్ ఫ్రెండ్‌కి చూపించి తెచ్చివ్వొచ్చా?"

"మీ గాళ్ ఫ్రెండ్‌నే ఇక్కడికి తీసుకురండి"

"వాళ్ళాయన వప్పుకోడు గదా!"

"మైగాడ్!" తుళ్ళి తుళ్ళి నవ్వుతుంది.

"ఇప్పుడు మంచినీళ్ళిస్తారా?"

"మీరింకా ఏమీ కొనలేదుగా?"

"తప్పు మీదే! కాష్ డౌన్ అని బెదిరించి కొననీయటం లేదు."

ఆమె లోపలికెళ్ళి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. గడగడ తాగుతూ "మంచినీళ్ళడిగితే బ్రాందీ ఇచ్చారేమిటి?"

ఆమె ఆశ్చర్యంగా చూసింది గ్లాస్ వేపు.

"ఓ! మీ చేతులతో పట్టుకునేసరికి నీళ్ళకే మత్తొచ్చినట్లుంది"

మళ్ళీ తుళ్ళి తుళ్ళి నవ్వు

"అయితే ఈ బొమ్మ రిజర్వ్ చేసి వుంచండి! జీతం రాగానే తీసుకెళ్తాను."

"జీతం ఎప్పుడొస్తుంది"

"ఉద్యోగం రాగానే"

"యూ ఆర్ క్రేజీ"

"బికాజ్ ఆఫ్ యూ"

సురేష్ బయటకు నడిచాడు "థాంక్యూ!"

"వెల్కమ్ ఎగైన్"

సురేష్ ఇంటికి చేరుకున్నాడు. తులసి స్టవ్ మీద ఏదో వండుతోంది. ఆమె మీదకు వంగి కౌగిలించుకుని మెడ మీద ముద్దు పెట్టుకున్నాడు.

"ఏమిటిది?" చికాకుగా అందామె.

"వంటింట్లో లవ్... ఉజ్వల సాంఘిక చిత్రం. రోజుకొక ఆట! సాయంత్రం ఏడుగంటల నుంచి."

"ఉష్!"

ఆమెను తనవేపు తిప్పుకున్నాడు.

"ఇదిగో ! మన తొలి పరిచయమునకు గుర్తుగా....ప్రేమతో నీ.....సురేష్" జేబులోంచి అందమయిన చిన్న బొమ్మ తీసి ఆమెకిచ్చాడు. తులసి అది చూస్తూనే ఉప్పొంగిపోయింది.

"సో లవ్లీ! ఎక్కడిది?"

"ప్రశ్నలొద్దు. నచ్చిందా?"

"ఎలా కొన్నావు"

"వేర్ దేరీజ్ లవ్ దేరీజ్ వే."

అతని తలవంచి ముద్దు పెట్టుకుందామె.

"థాంక్యూ డియర్! ఐ లవ్ దిస్ . ఐ లవ్ యూ" అంది

మర్నాడు రాత్రి ఏడు గంటలకి డెబనీర్ బార్కు చేరుకున్నాడు. తులసి గంగాభవాని వాళ్ళింట్లో టివి సినిమా చూడడానికి వెళ్ళింది.

గేటు దగ్గరున్న ఎయిరిండియా మార్క్ రాజు అచ్చం అలాగే వంగి నమస్కరించాడు.

“ప్లీజ్ కమిన్ సర్! వెల్‌కమ్”.

“నేను డార్క్‌డెవిల్‌ని కలుసుకోవాలి. వాడు నా ఫ్రెండ్!”

“నాకు చెప్పారు సార్! రండి ....ప్లీజ్ కమిన్! మీ కోసం ఆ ముందు టేబుల్ రిజర్వ్ చేశారు”.

సురేష్ లోపలికి నడిచి కూర్చున్నాడు.

డార్క్‌డెవిల్ విజృంభించి గిటార్ వాయిస్తున్నాడు.

“ఓ హసీనా జుల్ఫోవాలీ జానే జహా?” పాట గిటారు డ్రమ్స్‌తో మోతెక్కిపోతోంది. డాన్స్ చేస్తున్న అమ్మాయి ఈ లోకాన్ని మరిచిపోయినట్లుంది,

తను ఆ అమ్మాయితోపాటు మరో లోకంలోకి వెళ్ళిపోయాడు సురేష్ . డార్క్‌డెవిల్ గిటార్ తాలూకూ తరంగాలు అందరినీ ఊపిపారేస్తున్నాయ్.

పాట అయిపోయింది.

ఆ అమ్మాయి లోపలికెళ్ళిపోయింది. స్పృహలోకొచ్చి చుట్టూ చూశాడు. ఆడా, మగా సెంట్‌పర్సెంట్ మేకప్‌లో కూర్చుని డ్రింక్స్ తాగు తున్నారు.

బేరర్ వచ్చి సురేష్ దగ్గర వినయంగా నిలబడ్డాడు.

“ఏం తెమ్మంటారు సార్?”

“ఏమీ వద్దు! నేను డార్క్‌డెవిల్ కోసం వచ్చాను.”